# జాతి ఊర కుక్క

మూడు రోజుల కిందట –

ముందు జిల్లా జడ్జీగారొచ్చేరు.

వెనకే ముసురూ వచ్చింది.

ఆ ముసురూ వదల్లేదు. అందులోనూ ఆ ఏరియాలో ముసురు పట్టుకుంటే అథమం వారం రోజులుంటుంది. ఆ తడికి మనుషులు కూడా మొక్కలా మొలిచిపోతామేమో అనిపిస్తుంది.

అప్పుడు మా వారింకా మునసబు. జడ్జీగారు సబ్ కోర్టు ఇనస్పెక్షనుకి వస్తున్నారు. పాపం! ఆ సబ్ జడ్జీగారు యింకో ఆర్నెల్లలో రిటైరైపోతారు. అతనికి అన్ని జబ్బులూ తగు మోతాదులో ఉన్నాయి. అంచేత ఆయన లంచ్ తరవాత మరి బెంచి ఎక్కరు. ఓ గంట చాంబర్స్‌లోనే నిద్రపోయి లేచి ఏవైనా డిక్టేషన్స్ ఉంటే అక్కడే చెప్పేస్తారు. ఇంటికి ఏ కాయితం తీసికెళ్లరు. చాలా వరకు పాత కేసులు ఈ మధ్యనే అడిషనల్ సబ్‌జడ్జికి తోసేసేరు.

ఆయన మావార్ని ఓ రోజు ఛాంబర్సులోకి పిలిచి "నరసింగరావు. నువ్వు చిన్నవాడివి. సత్తా ఉన్నవాడివి. ఏం చేస్తావో, ఎలా చేస్తావో నాకు తెలీదు. కాని యీ యినస్పెక్షను గండం నుంచి గట్టెక్కించు" అన్నారుట.

"అయినా రిటైరయిపోయీ ముందు మీకు భయం ఎందుకు సార్. యినస్పెక్షను రొటీన్ అంతే. చేసుకు పోనివ్వండి" అన్నారు మావారు.

అప్పుడు మావారు పైలా పచ్చీసులో ఉన్నారు. పైగా ఉద్యోగంలో చేరిన కొత్త కాబట్టి ఇంద్రుడి భయం, చంద్రుడి భయం లేవు. అందులోనూ పై ఆఫీసరుకి సలాం కొట్టడం అసలు గిట్టదు.

సబ్ జడ్జిగారు తొందరలో రిటైరైపోతున్నా, రిటైర్‌మెంటు ఏజ్

పెంచుతారన్న ఓ రూమరుంది. ఆ రూమరే గనక నిజం అయితే యీాయన చివరలోనైనా జిల్లా జడ్జి అయ్యే ఛాన్సు మినుకు మినుకు మంటుంది. మరి యిప్పుడీ మూర్ఖుడు కాన్ఫిడెన్షియల్స్ తగలపెట్టేస్తే? అదీ ఆయన పైకి ఒప్పుకోని భయం.

"యితనికి పట్టి గీర ఎక్కువటయ్యా బాబూ. డైరెక్ట్ రిక్రూట్ కదా."

మా వారికి సర్రున కోపం వచ్చేసింది. "డైరెక్టు రిక్రూట్‌లకి కొమ్ములూ, కోరలూ ఉంటాయా? వాళ్లు హైకోర్టులోనో, జిల్లా కోర్టులోనో ప్రాక్టీసు చేసేరు. అంచేత వాళ్లకి ఆ ఛాన్సు వచ్చింది. మాలాగ మొఫసిల్‌లో చేస్తే మునసబే అయ్యేవాడు" అన్నారు.

సబ్ జడ్జిగారికి మావారి దూకుడుకి కోపం రాలేదు. ఆయన నవ్వుతూ "నరసింగరావు నువ్వు జీవితంలో చాలా నేర్చుకోవాలయ్యా (రహస్యం చెప్తున్నట్టు, ఎవరైనా వింటారేమోనన్నట్టు అతి నెమ్మదిగా) అదీ అయిందట. యితగాడు ఒక సీనియరు దగ్గరుండేవాడు. ఆ సీనియరు యితని చేత కట్టలు మోయించడం మినహా ఓ వాయిదా కూడా అడగనివ్వలేదు. యింకా యితగాడి దగ్గరుంటే కట్టలు మొయ్యటం తప్ప ఏం రాదని సెకండు క్లాసు మెజిస్ట్రేటు సెలక్షనుకి వెళ్లాడు. నువ్వు అందుకూ పనికిరావు పొమ్మన్నారు.

అదిగో ఆ టైములోనే అతనికి ఒక మినిష్టరుగారు కబురు చేశేరు. 'నువ్వు మా మేనకోడలుని పెళ్లాడు. నీకు నేను డైరెక్టు జడ్జి యిప్పిస్తాను' అని. చూచేవా? అప్పుడా మేస్ట్రేటు ఉద్యోగం రాక పోవడమే మంచిదైంది. ఏవుంది? పెళ్లి, ఉద్యోగం ఒక్కసారే వచ్చేయి. అయితే ఇందులో ఓ చిన్న ఫరకు ఉంది. ఆ మేనకోడలుకి కించిత్ మెల్ల ఉందిట. సిరిమెల్లట. డైరెక్టు రిక్రూట్ జిల్లా జడ్జి మొగుడవడం సిరికాక మరేవిటి?" అన్నారు.

మా వారిలో శంకరుడి అంశ కొంత ఉందేమో అనిపిస్తుంది. ఎవరైనా సరే "నువ్వు యీా పని చెయ్యగలవు" అంటే చాలు చేసేరన్నమాటే. అంతే.

అంచేత "మీకెందుకు సార్. నాకొదిలేయండి" అని అభయం యిచ్చేశరు.

కాగా పోగా ఆ జడ్జిగారు మొన్నదిగేరు భార్య, కుక్కలు సమేతంగా. తన ఉద్యోగానికి కారణభూతురాలైన భార్యంటే ఆయనకి వల్లమాలిన కృతజ్ఞత. కుక్కలంటే అపరిమితమైన ప్రేమ. అంచేత ఈ కృతజ్ఞతనీ, ఆ ప్రేమనీ ఆయన బాత్రూమ్‌లోకి, కోర్టుకి తప్ప మిగతా అన్నిచోట్లకీ తీసికెళ్తారు.

సాధారణంగా ఏ డిపార్టుమెంటైనా సరే పై ఆఫీసరు యినస్పెక్షనుకి వస్తే వాడికి ఊపిరి ఆడకుండా డిన్నర్లు, లంచ్‌లు వగైరాలు ఏర్పాటు చేసేస్తారు. అది రివాజు. ఆ బాస్‌ల భార్యలకి దేవాలయాలు, సినిమాలు వగైరాలు చూపిస్తారు.

జిల్లా జడ్జీ అంటే మాటలా? ఓ పూట ఎ.పి.పి. గారింట్లో లంచ్ అయితే, మరోపూట డి.ఎస్.పి. గారింట్లో డిన్నరు. ఓ పూట రోటరీవాళ్లు, మరోపూట లయన్స్ వాళ్లు. యిలా వారాల కుర్రాడిలా మూడు రోజులూ పకడ్బందీగా ఏర్పాట్లు జరిగిపోయేయి. యీ రాత్రి డిన్నరుతో ఆఖరు. తెల్లారితే జడ్జీగారు వెళ్లిపోతారు.

పొద్దున పదిగంటలకి వెళ్లిన మనిషి యిప్పటి వరకూ పత్తా లేరు.

ఓ వైపు హోరున వర్షం.

ఇంటి వెనక కొబ్బరి తోట నిండా నిలువెత్తు నీరు. కోట్లకొద్దీ కప్పల కోరస్.

కరెంటు లేదు. (ఆ మాటంటే మా శీను "కరెంటేవిఁటే నీ మొహం. పవర్ సప్లై అను" అనేవాడు.)

నలుగురు చిన్న పిల్లలు.

గుండెల్లో ప్రాణాలు గుప్పెట్లోకి వచ్చేశేయి.

రాత్రి పదైంది.

పన్నెండైంది.

ఏమైపోయారీ మనిషి?

అయినా యితనికి బుద్ధిలేదు.

యింక రాదు.

అయినా ఎవరి కోర్టో యినస్పెక్షనైతే యితనికెందుకు? తగుదునమ్మా అని అన్నీ నెత్తినేసుకోవడం, పరోపకారి పాపన్నలా ఫీలవడం.

కొంపదీసి ఏదైనా ఏక్సిడెంటు అవలేదు కదా? ఈ అర్ధరాత్రి ఎక్కడని వెతకను?

వీధి వరండాలో ఒక జవాను పడుక్కుంటాడు. కాని వాడు మాత్రం యీ వానలో, చీకటిలో ఎక్కడికెళ్తాడు?

బాధలెక్కువైపోతే బుర్ర పని చెయ్యడం మానేస్తుంది. నాకు బుర్ర పని చెయ్యడం మానేసింది.

అలా పిచ్చి దానిలా పిల్లల వేపు, వాచీ వేపు చూస్తూ కూర్చున్నాను.

తెల్లారింది. వానా తగ్గింది.

అప్పుడొచ్చేరు మావారు. ఈడ్చిఈడ్చి తన్నినట్టున్నారు. మనిషిని పిడిస్తే పీపాడు నీళ్లు కారతాయి.

“ఐదు నిమిషాల్లో వేడి కాఫీ ఇయ్యి” అన్నారు. అర నిమషంలోనే యిచ్చేశేను.

వేడి కాఫీ తాగేక మనిషికి నోటంట మాట వచ్చింది. జరిగిందేమిటంటే

జడ్జీగారు భార్య, కుక్కలు సమేతంగా వచ్చేరు కదా. అమ్మగార్ని గుళ్లకీ, గోపురాలకీ, సినిమాలకీ తీసికెళ్లడానికి యిద్దరు జవాన్లనీ, కుక్కలకి మరో యిద్దర్నీ గెస్టుహౌస్ దగ్గర డ్యూటీ వేశేరు. ఆ జవాన్లు కూడా జాగ్రత్తగానే చూస్తున్నారు అమ్మగార్నీ, కుక్కల్నీ.

మా ఊర్లో సినిమాలు మార్నింగ్ షోలు ఉండవు. కాని అమ్మగారి కోసం స్పెషల్ మార్నింగ్ షో వేయించేరు. ప్రేక్షకులు అమ్మగారు, ఇద్దరు జవాన్లు.

రాత్రి డిన్నరుతో అంతా సవ్యంగా జరిగిపోయిందని మావారు సంతోషించేరు.

జడ్జీగారు మావారి ఎరేంజ్‌మెంట్స్‌కి ముగ్ధులైపోయేరుట. అయితే మావారు తన కోర్టు మానలేదు.

పాటకచేరీ ఆఖర్న అపశృతి పలికినట్లు అదిగో అప్పుడే అపశృతి పలికింది.

ఆ సాయంత్రం ఏడుగంటలకి గెస్టుహౌస్‌కి నైట్ డ్యూటీ జవాన్లు

వచ్చేరు. వాళ్లూ, వీళ్లూ కలిసి బీడీలు కాలుస్తూ కుక్కల కబుర్లలో పడ్డారు.

వాళ్ల కబుర్ల సారాంశం - ఈ జవాను ఉద్యోగం కంటె జడ్జీగారింట్లో కుక్కగా పుట్టడం మంచిది. మనుషుల్లోలాగే కుక్కల్లో కూడా మహారాజయోగం ఉన్న కుక్కలుంటాయి. అవే గొప్పవాళ్లింట్లో కుక్కలుగా పుడతాయి.

మనుషుల్లో గొప్ప, బీద ఉన్నట్టే కుక్కల్లోనూ ఉన్నాయి.

ఊర కుక్కలు బీద వెధవలు.

అందుకే జాతి కుక్క - జాతి కుక్కది కాదు. దాని యజమానిది - వీధి కుక్కని దగ్గరక్కూడా రానివ్వదు. వీధి కుక్కలు కూడా ఎక్కడైనా పొరపాటున ఓ పెంపుడు కుక్క తమ మధ్యకి వస్తే పీకేస్తాయి.

అందరూ మనుషులే అయినా గొప్ప, బీదల మధ్య పరస్పర విరోధం, వర్గ పోరాటం ఉన్నట్టే, కుక్కల్లో కూడా గొప్ప, బీదల పరస్పర విరోధం ఉంటుంది.

పరస్పర విరోధ జంతువులంటే పులి-మేక, పిల్లి-ఎలుక, భర్త-భార్య, వగైరా కుక్క, పెంపుడు పిల్లి-ఊర పిల్లి యివీ పరస్పర విరోధ జంతువులే.

సావాస దోషం వల్ల వీటిక్కూడా యజమాని గుణాలే అబ్బుతాయి.

అదీ కుక్కే, నేనూ కుక్కే అన్న సంగతి మరిచిపోయి తనేదో హైక్లాసు కుక్కలా ఫీలైపోతుంది పెంపుడు కుక్క.

జడ్జీల కుక్కలు, ఎస్పీల కుక్కలు అయితే మరి అడగక్కర్లేదు.

ఓ ఎస్పీగారు తన కుక్క, పిల్లగా ఉన్నప్పుడు ఒళ్లో కూర్చోపెట్టుకుని సరదాకి - కేవలం సరదాకే సుమా - జవాన్ల చేత సలాం కొట్టించేవాడు. అయితే అది పెద్దయ్యాక్కూడా ఎవడొచ్చినా సరే దానికి సలాం కొట్టకపోతే అరిచి గోల చేసేది.

ఈ జడ్జిగారి కుక్కలు మాత్రం తక్కువ తిన్నాయా?

పాలు తాగడానికి పింగాణీ ప్లేట్లు. పడుక్కోవడానికి సోఫాలు. కాఫ్ లెదర్ బెల్టులు. ఆ బెల్టులో బుజ్జి బుజ్జి వెండి గంటలు. నెయిల్ పాలిష్, పెర్ఫ్యూమ్ స్ప్రే. ఓహ్! ఏం భోగం! ఏం భోగం!!

ఈ జడ్జికి ముందుండే ఆయనకి ఒక అల్సేషియనుండేది. యిలాగె లాగుండేది?

జూలు కత్తిరించిన సింహంలా ఉండేది.

ఏమాట కామాటే చెప్పుకోవాలి. అతను పెళ్లాన్నిగాని, కుక్కని గాని ఎవర్నీ విడివిడిగా గాని, జమిలిగా గాని యినస్పెక్షనుకి తీసికెళ్లలేదు.

వాళ్ల పిల్లలు మాత్రం అప్పుడప్పుడు తండ్రికి తెలీకుండా దాన్ని సినీమాకి తీసికెళ్లేవారు. అది కూడా దర్జాగా ఓ కుర్చీలో కూర్చుని సినీమా చూసేది. కుక్కలు సినీమా చూడకూడదని రూలు లేదు కదా.

ఓసారి అంతా కుక్కతో సినీమాకి వెళ్లేరు. కొంతసేపు బాగానే కూర్చుంది. తరవాత దానికి ఏ సీను నచ్చలేదో ధామ్మని బాల్కనీ మీద నుండి కిందకి గెంతేసింది.

కింద కూర్చున్న జనానికి పైనుండి ఏం పడిందో అర్థం కాలేదు.

సినీమా హాలు కూలి పోతోందేమో అని భయపడి గొల్లున లేచి బైటకి పరిగెత్తారు. గోల ఏఁవిఁటో అర్థం కాలేదు ఆపరేటరుకి.

అంచేత సినిమా ఆపేశేడు. లైట్లు వేశేడు.

అప్పటికే పిల్లలు నూరు మైళ్ల స్పీడులో కిందకి పరిగెత్తడం, కుక్కని తీసుకుని కారులో పారిపోవడం జరిగేయి.

ఈ నలుగురు జవాన్లు యిలా ఆఫీసర్లు కుక్కలు కథలు చెప్పుకుంటున్నారు.

వీళ్లొకటి అనుకుంటే ఆ కుక్కలు ఇంకోటి అనుకున్నాయి. వాటినలా కట్టి పడెయ్యడం వాటికేమాత్రం నచ్చలేదు. అమ్మగారికీ, అయ్యగారికి బోలెడు ఎంటర్ టైన్ మెంటు. మరి మాకేవుంది అనుకున్నాయి. వాటికి బోలెడు విసుగొచ్చేసింది. ఈ జవాన్లు ఎంతసేపూ బీడీలు కాల్చుకోవడం, కథలు చెప్పుకోవడం తప్ప మాతో కొంతసేపు ఆడరే అని తెగ బాధపడిపోయేయి. అలా బాధపడి పడి అందులో ఒకటి గొలుసు తెంపుకుని పారిపోయింది.

కుక్క కథలు చెప్పుకుంటున్న జవాన్లలో ఒకడు ఉన్నట్టుండి కెవ్వున కేక పెట్టేడు.

అసలే కాలువ ఒడ్డున గెస్టుహౌస్. ఎటు చూసినా పావుఁలే. ఏ పామైనా కుట్టలేదు కదా?

లేదు.

మరేంవిటి?

ఎందుకా గావుకేక?

రెండో కుక్కేదీ?

నలుగురి గుండెలూ ఒక్కసారి ఆగేయి.

గెస్టుహౌస్‌లో అమ్మగారి దగ్గరుందేమో!

అమ్మగారు డిన్నరు కెళ్లేరుకదా.

మరేమైంనట్లు?

చుట్టు పక్కలంతా వెతికేరు.

సినిమాలో హీరో హీరోయిన్ కోసం అరచినట్లు అరిచేరు. వాళ్ల అరుపులు కప్పల అరుపుల్తో కలిసి పోయేయి.

వెంటనే మా వారికి ఎస్.ఓ. ఎస్. వెళ్లిపోయింది. అప్పుడే డిన్నరుకి కూర్చోబోతున్న మావారు "మీరు ప్రారంభించండి సార్. ఐ విల్ జాయిన్ యు లేటర్" అని ఎపోలజిటిక్‌గా చెప్పి బైటకి పరిగెత్తేరు.

వెంటనే అన్ని కోర్టుల సిరస్తదార్లు, హైడ్‌క్లర్కులు, జవాన్లు అందరూ శిఖరాగ్ర సమావేశం అయ్యేరు. తరవాత మావారు, సిరస్తదారు కార్లోను, కొంతమంది స్కూటర్ల మీద, సైకిళ్ల మీద ఊరు నాలుగు దిక్కులా పరిగెత్తేరు.

రాత్రంతా తప్పిపోయిన వార్‌ప్రిజనర్ కోసం పోలీసులు గాలించినట్లు గాలిస్తూనే ఉన్నారు. ఈ వేటలో డిఎస్పీ గారు, పోలీసులు కూడా పాల్గొన్నారు.

తెల్లవారు జాము ఔతోంది.

అందరికీ నిస్పృహతోపాటు ఏడుపు కూడా వచ్చేస్తోంది.

తెల్లారి జడ్జీగారికి ఏం సమాధానం చెప్పాలి?

మా వారికి శ్రీకాకుళం, సబ్‌జడ్జీకి ఆదిలాబాదు ట్రాన్స్‌ఫర్ ఖాయం.

అయితే మరి కాసేపట్లో సూర్యోదయంతోపాటు కుక్కోదయం కూడా అయింది.

పక్కనున్న పల్లెటూరు పొలిమేరలో లంబాడీలు గుడిసెలేసుకున్నారు. వాళ్ళ గుడిసె దగ్గర కట్టేసి ఉంది కుక్క.

మా కోర్టు స్టాఫ్‌కి సంతోషంతో నోట మాట రాలేదు. తరవాత ఆ కుక్క మా జడ్జిగారిది యిమ్మన్నారు.

"మాకు రోడ్డు మీద దొరికింది. ఛస్తే యివ్వం" అన్నారు వాళ్లు.

వాళ్లూ, వాళ్లూ అరగంట ఘర్షణ పడ్డారు.

అఖర్ని వాళ్లకి రెండు వందలు యిచ్చి కుక్కని తెచ్చి మళ్లీ గెస్ట్‌హౌస్ దగ్గర కట్టేశారు.

మొత్తానికి కుక్క పోవడం, దొరకడం రెండూ జడ్జీగారికి తెలీదు.

థేంక్ గాడ్!

శ్రీకాకుళం, అదిలాబాదు ట్రాన్స్‌ఫర్లు తప్పేయి.

యింతకీ రిటైర్‌మెంటు ఏజ్ పెంచలేదు.

సబ్ జడ్జిగారు అర్నెల్లలో రిటైరైపోయేరు.

★ ★ ★